

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్.. మల్లారెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళాశక్తికి ప్రతీక ఐలమ్మ: కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 10(నమస్తేతెలంగాణ): తెలంగాణ మహిళా శక్తికి, బహుజనుల ధీరత్వానికి ప్రతీక చిట్యాల ఐలమ్మ అని మాజీ సీఎం కేసీఆర్ అభివర్ణించారు. మంగళవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కేసీఆర్ ఒక ప్రకటనలో ఆమెను స్మరించుకున్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే ఉద్యమించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక పాలనపై ధిక్కారాన్ని ప్రకటించిన ఐలమ్మ జీవితం ఆదర్శనీయమన్నారు. ఆమె జయంతి, వర్ధంతిని బీఆర్ఎస్ హయాంలో అధికారికంగా నిర్వహించి గౌరవించిందని గుర్తుచేశారు.

**ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి ఐలమ్మ: కేటీఆర్**

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం ఎన్నో ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని కేటీఆర్ అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రత్యేక చొరవతో ఆమె జీవిత చరిత్రను పాఠశాల విద్యలో పాఠ్యాంశంగా చేర్చారన్నారు. పాలకుర్తి మార్కెట్ యార్డుకు ఐలమ్మ పేరు పెట్టారని పేర్కొన్నారు.

# మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు

ఐలమ్మ మనుమరాలికి మహిళా కమిషన్‌లో చోటు • ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ)/ రవీంద్రభారతి : కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రవీంద్రభారతిలో మంగళవారం నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి సభ లో సీఎం పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ చరిత్ర మరువలేనిదని, ఐలమ్మ స్ఫూర్తితో భూములను కాపాడుతున్నామన్నారు. ఆమె మనుమరాలు శ్వేతను తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం ఐలమ్మ కుటుంబసభ్యులను సీఎం రేవంత్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గత కేసీఆర్ సర్కారు 2022-23లో కోఠి మహి ళా కాలేజీని వర్సిటీగా అప్‌గ్రేడ్ చేసి 'తెలంగాణ మహిళా విశ్వ




ఐలమ్మ మనుమరాలితో సీఎం రేవంత్‌రెడ్డి

విద్యాలయం' పేరును ఖరారు చేసి, 100 కోట్ల నిధులను ప్రకటించింది. రెం డేండ్లుగా వర్సిటీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. తాజాగా ఐల మ్మ పేరును పెడతామని సీఎం ప్రకటించారు. తెలుగు వర్సిటీ పేరు మార్పుపైనా ఊహాగానాలు వెలువడుతున్నాయి.

# అప్పుల్లో రేవంత్ సర్కార్ రికార్డు

- **ఈ ఏడాది జూలైలో 10,392 కోట్ల అప్పు**
- **తెలంగాణలో అత్యధిక నెలవారీ అప్పు ఇదే**
- **ఆదాయం కన్నా అప్పే 141 కోట్లు ఎక్కువ**
- **స్వయంగా కాగ్‌కు నివేదించిన ప్రభుత్వం**
- **వారం రోజుల్లోనే 4 వేల కోట్ల అప్పులు**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణ చరిత్రలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరుదైన రికార్డును సృష్టించింది. ఈ ఏడాది జూలైలో ఏకంగా రూ.10,392 కోట్ల అప్పు చేసింది. తద్వారా గత పదేండ్లలో ఎన్నడూ లేనివిధంగా ఒకే నెలలో రూ.10 వేల కోట్లకు పైగా అప్పుతో 'చరిత్ర' సృష్టించింది. ఈ విషయాన్ని స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు నివేదించింది. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తూనే రేవంత్ సర్కారు 'అంతకు మించి' అనే స్థాయిలో ఎడాపెడా అప్పులు చేస్తున్నదనడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం.



**ఆదాయం కన్నా అప్పే ఎక్కువ**

రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన నివేదిక ప్రకారం.. ఈ ఏడాది జూలైలో వచ్చిన ఆదాయం కంటే రేవంత్‌రెడ్డి సర్కారు తెచ్చిన అప్పే ఎక్కువ. జూలైలో పన్నుల రూపేణా దాదాపు రూ.9,966 కోట్లు, నాన్-ట్యాక్స్ రెవెన్యూ కింద రూ.257 కోట్లు, లోన్లు, అడ్వాన్సుల రికవరీ రూపంలో రూ.3.62 కోట్లు కలిపి రాష్ట్రానికి మొత్తంగా రూ.10,226.46 కోట్ల ఆదాయం వచ్చినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కానీ, ఇదే నెలలో ప్రభుత్వం తెచ్చిన అప్పు రూ.10,392.71 కోట్లు. ఈ లెక్కన రాష్ట్రానికి వచ్చిన ఆదాయం కంటే అప్పే రూ.141.13 కోట్లు ఎక్కువ. ఈ ఆర్థిక సంవత్సరంలోని తొలి 4 నెలలను పరిశీలిస్తే జూలైలో రాబడి గణనీయంగా తగ్గినట్టు స్పష్టమవుతున్నది. ఏప్రిల్‌లో రూ.11,821 కోట్లు, మే నెలలో రూ.11,332 కోట్లుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం.. జూన్‌లో రూ.12,465 కోట్లకు పెరిగినట్టు గణాంకాలు చెప్తున్నాయి. దీనితో పోలిస్తే జూలైలో ప్రభుత్వ రాబడి రూ.2,239 కోట్లు, నిరుడు ఇదే సమయంలో వచ్చిన రాబడి కంటే రూ.1,091 కోట్లు తగ్గింది.

**ప్రజాపాలనలో రూ.10 వేల కోట్ల మార్క్**

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో అత్యధికంగా ఒకే నెలలో చేసిన అప్పు రూ.9,897 కోట్లు మాత్రమే. 2020 డిసెంబర్‌లో ఆ రుణాన్ని తీసుకున్నది. అయితే ఆ ఏడాది కరోనా విజృంభించడం, లాక్‌డౌన్ తదితర కారణాలతో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు స్తంభించాయి. ప్రభుత్వాలకు రాబడి పడిపోయింది. ఈ నేపథ్యంలో అటు ప్రభుత్వ నిర్వహణతోపాటు సంక్షేమ పథకాలను కొనసాగించేందుకు కేసీఆర్ ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో భారీగా రుణం తీసుకోవాల్సి వచ్చింది. కానీ, ఈ ఏడాది జూలైలో అలాంటి పరిస్థితులేమీ లేవు. అయినా ప్రజాపాలన పేరుతో రేవంత్‌రెడ్డి సర్కారు ఒకే నెలలో రూ.10 వేల కోట్లకుపైగా అప్పు చేసింది. అయినా ఆ అప్పుతో కొత్త పథకాన్నో, ప్రాజెక్టునో చేపట్టిన దాఖలాలేమీ లేకపోవడం గమనార్హం.

**మరో 1,500 కోట్ల అప్పు**

బాండ్ల వేలం ద్వారా ఈ నెల 3న రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) నుంచి రూ.2,500 కోట్ల అప్పు తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా మంగళవారం మరో రూ.1,500 కోట్ల రుణాన్ని తీసుకున్నది. దీంతో వారం రోజుల్లోనే రూ.4 వేల కోట్ల అప్పు తీసుకున్నట్టయింది. దీంతో గత 9 నెలల్లో రేవంత్‌రెడ్డి సర్కారు ఆర్బీఐ నుంచి తెచ్చిన అప్పులే రూ.46,118 కోట్లకు చేరాయి.

**5 నెల్లలోనే సగం అప్పు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.69,012 కోట్ల అప్పులు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అందులో బహిరంగ మార్కెట్ నుంచి రూ.57,112 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.3,900 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1,000 కోట్లు సమీకరించనున్నట్టు బడ్జెట్‌లో వివరించింది. కానీ, ఇప్పటివరకు బాండ్ల వేలం ద్వారా బహిరంగ మార్కెట్ నుంచి రూ.31 వేల కోట్ల రుణాలు సేకరించింది. అంటే ఈ ఏడాది బడ్జెట్‌లో పెట్టుకున్న లక్ష్యంలో సగానికిపైగా అప్పును కేవలం 5 నెలల్లోనే చేసిందన్నమాట. దీంతో మిగతా 7 నెలల్లో రేవంత్ సర్కారు రాష్ట్ర ప్రజల నెత్తిపై ఇంకెంత అప్పుల మూటను పెడుతుందోనని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రుణాల రీస్ట్రక్చరింగ్‌కు అవకాశమివ్వండి

- **కేంద్ర పన్నుల్లో వాటాను 50 శాతానికి పెంచాలి**
- **16వ ఆర్థిక సంఘానికి సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి సూచన**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): అలవిగాని హామీలతో తెలంగాణను అప్పుల ఊబిలోకి నెడుతున్న కాంగ్రెస్ సర్కారు.. ఇప్పుడు ఆ రుణాల రీస్ట్రక్చరింగ్‌కు అవకాశం ఇవ్వాలని లేకుంటే రాష్ట్రానికి అదనపు ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సహా పలువురు ప్రభుత్వ పెద్దలు మంగళవారం ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం చైర్మన్, సభ్యులతో సమావేశమై మూకుమ్మడిగా ఈ విజ్ఞప్తి చేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలని కోరారు. అన్ని రాష్ట్రాల తరఫున ఈ డిమాండ్‌ను ఆర్థిక సంఘం ముందు పెడుతున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ డిమాండ్‌ను నెరవేర్చితే దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణాన్ని 5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలన్న ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యానికి పూర్తిగా సహకరిస్తామని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలపై కేంద్ర ఆర్థిక సంఘానికి ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కొన్నేండ్లుగా రాష్ట్రాలతో పంచుకోని సెస్‌లు, సర్‌చార్జీలు పెరిగాయని, మొత్తం స్థూల పన్ను ఆదాయంలో రాష్ట్రాలు తక్కువ వాటాను కలిగి ఉన్నాయని స్పష్టం చేశారు. దేశంలోనే తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అనంతరం 16వ ఆర్థిక సంఘం సభ్యులతో కలిసి చైర్మన్ అరవింద్ పనగరియా మీడియాతో మాట్లాడారు. నిర్దిష్ట అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రాయోజిత పథకాలను (సీఎస్ఎస్) రూపొందించేందుకు అవసరమైన స్వయం ప్రతిపత్తిని రాష్ట్రాలకు కల్పించాలని, అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా కేంద్ర పథకాల్లో మార్పులకు అవకాశం కల్పించాలని 16వ ఆర్థిక సంఘాన్ని తాము కోరినట్టు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అంతకు ముందు చెప్పారు.

# పెంట్లవెల్లి రైతుల గోడు తీర్చండి!

- **పెంట్లవెల్లి పరిధిలో ఒక్కరికీ కాని రుణమాఫీ**
- **ముఖ్యమంత్రి మాటలు పచ్చి బూటకం**
- **పావుశాతం కూడా చేయకుండా వందశాతం చేశామంటూ పోజులు**
- **గురుకులాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి : కేటీఆర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ పూర్తి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి మాటలు బూటకమని చెప్పడానికి పెంట్లవెల్లి రైతుల గోసే సజీవ సాక్ష్యమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. నాగర్ కర్నూలు జిల్లాలోని పెంట్లవెల్లిలో ఉన్న 499 మంది రైతుల్లో ఒక్కరికీ రుణమాఫీ కాకపోవడం పచ్చిమోసం కాక మరేమిటని మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. డిసెంబర్ నుంచి ఆగస్టు 15 వరకు డెడ్‌లైన్లు పెట్టిన సీఎం.. నేటివరకూ వీరికి రుణమాఫీ ఎందుకు కాలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పావుశాతం కూడా మాఫీ చేయకుండా వందశాతం అయిపోయినట్టు ముఖ్యమంత్రి పోజులు కొడుతున్నారని విమర్శించారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే పెంట్లవెల్లి రైతుల రుణాలను మాఫీ చేసి వారి గోడు తీర్చాలని డిమాండ్ చేశారు. మరోవైపు గురుకులాల్లో విద్యార్థులు వరుసగా అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు రోజుల్లో సిర్పూర్‌లో 35 మంది గురుకుల విద్యార్థులు జ్వరాలబారిన పడ్డారని ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. బాగాలేని విద్యార్థులను తల్లిదండ్రుల వద్దకు పంపి చేతులు దులుపుకోవడం అంటే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమేనని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం కనీసం స్పందించడం లేదని ధ్వజమెత్తారు.

**మంచినీటినీ వదలని జూటా కాంగ్రెస్**

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గాలికొదిలి, బీఆర్ఎస్ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతాపం చూపుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదోడి బతుకు ఆగమాగమైందని విమర్శించారు. తాము ప్రకటించిన గృహజ్యోతికి తూట్లు పొడిచిన కాంగ్రెస్, ఇప్పుడు బీఆర్ఎస్ అమలు చేసిన 20 వేల లీటర్ల ఉచిత మంచినీటి పథకంపై కుట్రలు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఒకవైపు రుణమాఫీ కాలేదంటూ రుణాలు చెల్లించాలని రైతులకు నోటీసులు, మరోవైపు నిరుపేదల ఇండ్లకు హైడ్రా నోటీసులు, ఇప్పుడు నల్లా బిల్లులంటూ డోర్లకు బిల్లులు అతికియ్యడం ఏమిటని ప్రశ్నించారు.

## రుణమాఫీ చేయలేదని నిర్బంధం

**చందుపట్ల పీఏసీఎస్ పాలకవర్గం, సిబ్బందిని గదిలో బంధించిన బాధిత రైతులు**

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 10 : రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్ల పీఏసీఎస్ పాలకవర్గం, సిబ్బందిని అఖిలపక్షం ఆధ్వర్యంలో రైతులు నిర్బంధించారు. భువనగిరి మండలంలోని చందుపట్ల పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం చందుపట్ల రైతువేదికలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బ్యాంకు పరిధిలోని ఎనిమిది గ్రామాల రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తమకు రుణమాఫీ ఎందుకు కాలేదని రైతులు పాలకవర్గాన్ని నిలదీశారు. ఈ క్రమంలో రైతులు ఆగ్రహానికిలోనై పాలకవర్గ సభ్యులను, బ్యాంకు సిబ్బందిని గదిలో వేసి తాళం వేశారు. రుణమాఫీపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అంజిరెడ్డి రైతువేదిక వద్దకు వచ్చి రుణమాఫీపై హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



రైతులు తాళం వేసిన గదిలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, పాలకవర్గ సభ్యులు

# సర్కారు తప్పిదం.. ఇద్దరు రైతులకు శాపం

- **వేర్వేరు గ్రామాలు, కులాల రైతులకు ఒకే ఫ్యామిలీ ఐడీ**
- **67 వేలు, 1.67 లక్షల రుణాలున్నా మాఫీ కాని వైనం**
- **ఇద్దరినీ ఒకే కుటుంబంగా ఎలా చూపుతారంటూ గగ్గోలు**

చింతకాని, సెప్టెంబర్ 10: సర్కారు తప్పిదం.. ఇద్దరు అన్నదాతలకు శాపంగా మారింది. ఫలితంగా రైతు రుణమాఫీ వారికి అందని ద్రాక్షగానే మిగిలింది. ప్రభుత్వం తెచ్చిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ తికమకలతో ఇలా ఎందరో రైతులు రుణమాఫీకి దూరమయ్యారు. నక్కనబోయిన వలరాజుది ఖమ్మం జిల్లా చింతకాని మండలం కొదుమూరు. గురజాల రామారావుది లచ్చగూడెం. చింతకాని మండలంలోని బస్వాపురం యూనియన్ బ్యాంక్‌లో వలరాజుకు రుణఖాతా నంబర్ 1353లో రూ.67,878 పంట రుణం ఉన్నది. గురజాల రామారావుకూ అదే యూనియన్ బ్యాంక్‌లో రుణఖాతా నంబర్ 1335లో రూ.1,67,237 పంట రుణం ఉన్నది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇద్దరూ రుణమాఫీకి అర్హులే. కానీ మూడు విడతలు ముగిసి కాలం గడిచిపోతున్నా ఇద్దరికీ రుణమాఫీ కాలేదు. దీంతో బ్యాంకు అధికారుల చుట్టూ తిరిగి విసిగి వేసారిన ఇద్దరూ వ్యవసాయ అధికారులను సంప్రదించారు. అక్కడే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కొదుమూరు రైతు వలరాజు రేషన్ కార్డులో రామారావు పేరు కూడా ఉన్నదని, ఇద్దరూ ఒకే కుటుంబ సభ్యులుగా ఉన్నట్టు డేటా చూపిస్తున్నదని, ఇద్దరి రుణమా కలిపి 2 లక్షలు దాటినందున రుణమాఫీ జరగలేదని ఆఅధికారి చెప్పారు. దీంతో ఇద్దరూ కంగుతిన్నారు. తమవి వేర్వేరు గ్రామాలని, తాము వేర్వేరు సామాజికవర్గాలకు చెందినవాళ్లమని సదరు అధికారికి వివరించారు. సాంకేతికలోపం వల్ల ఇలా జరిగిందని ఆయన వారికి సమాధానం ఇచ్చారు.

**రేషన్ కార్డులో నాపేరే లేదు**



రుణమాఫీ జాబితాలో నా పేరు లేకపోవడంతో ఏఈవోను కలిశాను. ఆయన చెప్పిన విషయం విని ఆశ్చర్యపోయా. నాకుటుంబ రేషన్ కార్డులో నా పేరేలేదు. వేరే కార్డులో ఎలాఉందో అర్థం కావడం లేదు.

–గురజాల రామారావు, రైతు, లచ్చగూడెం

**పొరపాట్లు ఇప్పటికైనా సరిదిద్దాలి**



ఏఈవో అడిగిన పత్రాలన్నీ 20 రోజుల క్రితమే ఇచ్చాను. అయినా ఇంత వరకూ నాకు రుణమాఫీ కాలేదు. సరిదిద్ది రుణమాఫీని వర్తింపజేయాలి.

–నక్కనబోయిన వలరాజు, రైతు, కోదుమూరు

# 'స్థానికం' వచ్చే ఏడాదే

- **బీసీ గణనకు మూడు నెలల గడువు కోరిన ప్రభుత్వం**
- **ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'**

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థలు ఎన్నికలు ఈ యేడాది లేనట్లే.. ఎన్నికల నిర్వహణకు కీలకమైన బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును మూడు నెలల సమయం అడిగింది. దీంతో ఈ యేడాది స్థానిక సంస్థల ఎన్నికలు లేనట్లేనని స్పష్టమైంది. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో సాధ్యం కావని 'నమస్తే తెలంగాణ' ఈనెల 2వ తేదీన కథనం ప్రచురించింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ట్రిపుల్ టెస్ట్ ద్వారా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాలని సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు ఇచ్చింది. దీని కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని సూచించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ బాధ్యతను బీసీ కమిషన్‌కే అప్పగించింది. అయితే ఈ కమిషన్ గడువు ముగియడంతో కొత్త కమిషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ సుప్రీంకోర్టు తీర్పుపై అధ్యయనం చేసి, అవగాహనకు వచ్చి తదుపరి కార్యాచరణను ఖరారు చేయాల్సి ఉంది. ఈ తతంగమంతా పూర్తి చేయడానికి కనీసం 3 నెలల సమయం పడుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇదే విషయాన్ని హైకోర్టుకు తెలిపినట్టు బీసీ సంఘాల నేతలు చెప్తున్నారు. మధ్యలో ఎలాంటి అటంకాలు లేకుండా, వరదలు, విపత్తులు, అనుకొని సంఘటనలు ఏమైనా జరిగితే ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.



**42 శాతం సాధ్యమయ్యేనా?**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల సమయంలో జూన్‌లోనే స్థానిక సంస్థల ఎన్నికలు అంటూ ప్రకటన చేశారు. అప్పట్లోనే దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. కేవలం కాంగ్రెస్ క్యాడర్‌లో ఆశలు కల్పించడానికి, వారు ఆ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయించడం కోసమే అలాంటి ప్రకటనలు చేశారని విశ్లేషకులు అంచనా వేశారు. అదిగో ఎన్నికలు, ఇదిగో ఎన్నికలు అంటూ ప్రకటనలు చేస్తూ, లీకులు ఇచ్చారని పార్టీలు విమర్శించాయి. ఎన్నికల పూర్తి ప్రక్రియను ప్రభుత్వం ఇంతవరకు ప్రారంభించలేదు. కీలకమైన బీసీ రిజర్వేషన్లపై ఇంకా స్పష్టమైన వైఖరిని ప్రభుత్వం తీసుకోలేదని బీసీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై సీఎం రేవంత్ చేతులు ఎత్తేశారని విమర్శిస్తున్నాయి. బీసీలకు 24 శాతం కంటే ఎక్కువగా రిజర్వేషన్లు ఇచ్చే పరిస్థితి లేదని, మిగిలిన 18 శాతాన్ని రాజకీయ పార్టీలుగా టిక్కెట్లు ఇద్దామంటూ కొత్త ప్రతిపాదనను తీసుకవచ్చారని మండిపడుతున్నాయి. జనరల్ సీట్లలో బీసీలకు టిక్కెట్లు ఇచ్చినా ఇతర పార్టీలు ఓసీ అభ్యర్థులను నిలిపితే బీసీల గెలుపు అవకాశాలు దెబ్బతింటాయని, ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్న చరిత్ర కాంగ్రెస్‌దే

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబర్ 10: కాంగ్రెస్ పార్టీ చేసిన కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం బీసీలంతా పోరాడాలని, కాంగ్రెస్ పార్టీ కళ్లు తెరిపించడానికి మిలిటెంట్ ఉద్యమాలకు సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో మంగళవారం నిర్వహించిన 'బీసీ సదస్సు'లో రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులుతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్ల కోసం వెనుకబడిన వర్గాలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని, పోరాటాలతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా కుల గణన చేయక పోవడం వల్ల బీసీలు భారీగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల జనాభా 50 శాతానికిపైగా ఉన్నా రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని మండిపడ్డారు. జనాభా ప్రకారం న్యాయమైన వాటా దక్కాలంటే సమగ్ర కుల గణన ఒక్కటే మార్గమని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయడానికి రేవంత్‌రెడ్డికి వచ్చిన నష్టమేమిటని ప్రశ్నించారు. మండల్ కమిషన్ రిపోర్టును బుట్టదాఖలు చేశారని, నాటి ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీ రిజర్వేషన్లు అడ్డుకోవడంతో ఓబీసీలు భారీగా నష్టపోయారని తెలిపారు. మరోసారి బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని విమర్శించారు. సమగ్ర కులగణన లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని హెచ్చరించారు. ఈ సదస్సులో హిందు బీసీ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, సోషల్ జస్టిస్ పార్టీ జాతీయ కన్వీనర్ పిడికిలి రాజు, టీ-జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, తెలంగాణ బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తిగౌడ్, ఓబీసీ జేఏసీ చైర్మన్ అన్వర్ వేణుకుమార్, అంబేద్కర్ ఆజాదీ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కొంగర నరహరి, కుల సంఘాల నాయకులు దేగాం యాదగౌడ్, కోటగిరి రామగౌడ్ పాల్గొన్నారు.




మంగళవారం ఆర్మూర్‌లో జరిగిన బీసీ సదస్సులో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, బీసీ నేత రాజారాం యాదవ్ తదితరులు

**లోకం పోకడ**




దేశవ్యాప్తంగా మేఘాలు కమ్మేసి జోరుగా వర్షాలు కురుస్తుంటే మణిపూర్ మంటలతో భగ్గుమంటున్నది!

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఖమ్మం | 32.0°c | 24.0°c |
| వరంగల్ | 31.0°c | 25.0°c |
| ఆదిలాబాద్ | 30.2°c | 23.5°c |
| నల్లగొండ | 30.0°c | 22.4°c |
| కరీంనగర్ | 30.0°c | 26.0°c |
| మహబూబ్‌నగర్ | 29.3°c | 22.4°c |
| హైదరాబాద్ | 29.0°c | 22.0°c |
| నిజామాబాద్ | 28.5°c | 24.6°c |
| రంగారెడ్డి | 28.5°c | 21.7°c |
| మెదక్ | 28.4°c | 22.0°c |

## రాష్ట్రంలో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావం

మరో 2 రోజులు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ) : వాయువ్య బంగాళాఖాతంలో పూరి వద్ద తీరం దాటిన వాయుగుండం మంగళవారం ఉత్తర ఛత్తీస్‌గఢ్ వద్ద కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో మరో రెండు రోజులు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. గడిచిన 24 గంటల్లో ములుగు, కుమ్రంభీం-ఆసిఫాబాద్, జయశంకర్-భూపాలపల్లి, భద్రాద్రి-కొత్తగూడెం, పెద్దపల్లి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసినట్టు వెల్లడించింది. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో అత్యధికంగా 5.12 సెం.మీ, కన్నాయిగూడెంలో 2.81 సెం.మీ, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలో 4.98 సెం.మీ, చింతలమానెపల్లిలో 4.91 సెం.మీ, బెజ్జూర్‌లో 4.29 సెం.మీ, పెంచికల్‌పేటలో 3.20 సెం.మీ, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మలిమెలలో 4.35 సెం.మీ, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 2.84 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు పేర్కొంది.

# 3 నెలల్లో కులగణన

మొదటిపేజీ తరువాయి...

మంగళవారం నుంచి మూడు నెలల్లోగా పూర్తిచేయాలని స్పష్టం చేసింది. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ట్రిపుల్ టెస్ట్ ఉద్దేశం కూడా ఇదేనని, ఆ కోణంలోనే సర్వే జరగాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2010లో కృష్ణమూర్తి కేసులో వెలువడిన తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కల్పనకు ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని పరిగణనలోకి తీసుకోరాదని, రాజకీయ వెనుకబాటుతనాన్నే పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. వికాస్‌కిషన్‌రావు గావ్లీ వర్సెస్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు చెప్పిన తీర్పులోని 13వ పేరా ప్రకారం.. రాష్ట్రమంతటినీ ఒకే యూనిట్‌గా బీసీ రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలు లేదని పేర్కొన్నారు. ఆ తీర్పు మేరకు స్థానిక సంస్థలను యూనిట్‌గా తీసుకొని సర్వే చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఆ వివరాల రిజర్వేషన్లపై నిర్ణ యం తీసుకోవాల్సివుంటుందని అన్నారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి 3నెలల గడువు ఇవ్వాలన్న ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. మూడు నెలల్లోగా కులగణన నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది.

**సుప్రీంకోర్టు ఏం చెప్పింది?**

వికాస్‌కిషన్‌రావ్ గావ్లీ వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వం కేసులో 2021 మార్చి 4న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని 13వ పేరాలో... 'మహారాష్ట్ర జిల్లా పరిషత్, పంచాయతీ సమితి చట్టం – 1961లోని సెక్షన్ 12 (2) (సీ) ప్రకారం బీసీ రిజర్వేషన్లు 27 శాతంగా ఉన్నాయి. దీనిని ఏకరీతిగా మొత్తం రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు ఒకే తరహాలో అమలు చేయడం సబబు కాదు. అన్ని స్థానిక సంస్థల్లోనూ ఒకే తీరుగా బీసీ రిజర్వేషన్ల అమలు చేయడం సరికాదు. స్థానిక సంస్థల వారీగా బీసీల ఆర్థిక, సామాజిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని సర్వే చేయాలి. సమకాలీన పరిస్థితులను శాస్త్రీయంగా, లోతుగా అధ్యయనం చేయాలి. అందుకు అనుగుణంగా ఆయా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను అమలు చేయాలి" అని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం స్పష్టం చేసింది.

## 16న ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ బాట పట్టనున్నారు. ఈనెల 16వ తేదీన ఢిల్లీకి వెళ్లనున్నట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దీంతో 21వ పర్యటన కానున్నది. కొత్త పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ ప్రమాణం చేసిన తర్వాత.. సీఎం, పీసీసీ అధ్యక్షుడు కలిసి ఢిల్లీ పెద్దలను మర్యాదపూర్వకంగా కలువనున్నట్టు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణపై రేవంత్ రెడ్డి స్పష్టత కోరే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పుపైనా చర్చించే అవకాశం ఉన్నదని చెప్తున్నారు.